# వెలిగే నీడలు

## "ఉదయభాను"

అతడు అయిదారేళ్ళ పల్చటి కుర్ర వాడు-జాలిగా - దీనంగా, పరధ్యానంగా కూర్చున్నాడు ఆ గోడకు యివతల. నువ్వు పరదేశంలో చదువుకునేటప్పుడు తలపుకు వచ్చిన నీ చిన్నతమ్ముడిలాంటి వాడు. యీకుర్రవాడు 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, ద్వేషాలూ ఏమీ ఎరుగని వూవు' అతడు. అయిదారేళ్ళ పాప. దీనంగా, పరధ్యానంగా శూన్యంలోకి చూస్తున్నాడు. వాడు యీ గోడయివతల కూర్చున్నాడు.

సంతోషమూ, బాధా తెలియదు - భయమూ, స్వేచ్ఛా తప్పించి. దీక్షా పట్టుదలా వుండవు-ఉత్సాహమూ, వుద్వేగమూ మించి. పాపం వాడికి తల్లిలేదు. అమ్మా, నాన్న, గురువూ దైవం, గౌరవ భయమూ, విద్య గౌరవం, వూపిరి, నెత్తురూ అన్నీ వాళ్ళ నాన్నే - అతను రిక్షా త్రొక్కనీ, త్రాగి తందనాలాడనీ, కొడుకునితన్ననీ, దొంగతనంచెయ్యనీ ఈ నికృష్ట జీవితంలో యితన్ని కృశింపజేయనీ ఏం - అతను వాడికి తండ్రి - అంతకంటె వాడి వూపిరి.

పాపం, పల్చగా దిక్కులు చూస్తూ చొక్కలు ఎగరవేసుకుంటూ, గుమ్మలో, కూర్చున్నాడు కుర్రవాడు. దారినిపోయే ఎవరి మనోఆకాశాల్లోకి చొరనేరని దౌర్భాగ్యుడు. ప్రక్క హోటళ్ళనించి వచ్చే ప్రతి చిన్న వాసననీ ఆశతో వూహించుకుని, అందుకోలేక కూలబడిపోయిన కుర్రవాడు - దీనంగా పరధ్యానంగా కూర్చున్నాడు ఆ గోడకు యివతల.

తండ్రిని గోడల లోపలికి తీసుకుపోయారు యిద్దరు పోలీసులు. అతని నేరం ఈ కుర్రవాడికి తెలియదు. అసలు పోలీసులు తీసుకుపోవడానికి నేరం అంటూ ఒకటి వుండాలా!

తండ్రి చేసిన నేరం తెలియదు. మళ్ళీ వస్తాడనే ఆశ. అతను రాకపోతే ఎక్కడ వుండాలో కూడా వూహించలేనివయస్సు. వాళ్ళకు ఒక గుడిసె అంటూ వున్నా, తండ్రి లేకపోతే అక్కడే వున్నా ఆకాశంలో వున్నా అసలు లేకున్నా ఒకటే.

చీకటి పడిపోతున్నది. ఈ దుష్కృత్యాలు చూడ్డానికి సిగ్గై వెళ్ళిపోతున్నాడు గావును సూర్యుడు. ఇంకా కుర్రవాడు తన తండ్రి వస్తాడని కూచునేవున్నాడు. తండ్రి లోపల ఏం చేస్తున్నాడో, చూస్తున్నాడో, ఆలోచిస్తున్నాడో, ఏడుస్తున్నాడో ఎలా తెలుస్తుంది? ఏమిటని తెలుస్తుంది? గోడ అడ్డం వుంది - ఈ గోడ ఎప్పుడు ఎవరు ఎందుకు కట్టారు? ఏమిటీ యీ కుర్రవాణ్ణి యీ గోడ యివతలే వుంచింది? - ఎందుచేత అతను లోపలికి వెళ్ళకూడదు?

తండ్రి నేరం చేసేడనుకో - ఎంతో పెద్ద నేరమే అనుకో, ఎవరినో ఖూనీ చేసేడనుకొందాం. అతనికి శిక్ష విధించవలసి

రావడం న్యాయమే. ధర్మమే. అలా విధించకపోవడం క్రూరం, దారుణం కూడా – నిజమే.

అతనికే ఒక కుర్రవాడో, చిన్న పిల్లో ఎవరో వుండి, అతను అతను మాత్రమే కాకుండా ఒకడికి తండ్రి, యింకొకరికి అన్న, మరోవాళ్ళకి మామ యిలా అయ్యేవ్వాడు, అతనికి శిక్ష విధించడంకోసం ఆ కొడుకుకి తండ్రి లేకుండా, తమ్ముడికి అన్న కాకుండా, యింకొకరికి మామ వుండకుండా చెయ్యడం న్యాయమా ?

పాపం కుర్రవాడు, చిన్నవాడు, అయిదారేళ్ళవాడు, యింకా 'నా' అనే వాళ్ళు లేనివాడు – సర్వం తండ్రే అయినవాడు, తల్లి లేని పిల్లవాడు, ఆ గోడ యివతల కూర్చున్నాడు – అమాయకుడు – ప్రపంచం అంటే అర్థం తెలియనివాడు, భయం పీల్చుతున్నాడు, దిగులు తింటున్నాడు, తండ్రి వస్తాడా రాడా అనే సందేహం చేత తినబడుతున్నవాడు – వాడు యీ కుర్రవాడు. వాడికి శిక్ష విధించడానికి ఎవరికి ఏ అధికారం వుంది – అందునా అతను చేసిన తప్పు లేనివాడు. ఎంత శిక్ష ! ఊపిరి, నెత్తురు, సర్వస్వమూ అయిన తండ్రిని నాశనం చెయ్యడం – అయ్యో ! ఎంత దారుణం !!

ఇంక తండ్రి వస్తాడో రాడో, దీనంగా పరధ్యానంగా, దిగులుగా, గుండెల్లో బుగులుతూ కూర్చున్న కుర్రవాడికి ఎలా తెలుస్తుంది. అతని మాతృభాషలో అర్థం నిలబెట్టగాకు పోదను.

ఎలా తెలుస్తుంది కుర్రవాడికి. సమాజపుటాలోచన పరిధుల బయట క్రూరత్వం, అజ్ఞానం రాజ్యం చేస్తాయనీ, సంఘం నిర్ణయించిన హద్దులలోపల అది అంగీకరించింది న్యాయమై, ధర్మమై, ధర్మం చెల్లుతుందనీ, తనముందు నుంచున్న గోడ యీ ధర్మమేననీ, జాతి మనోవికాసానికీ, మానవ సత్యానికీ నిత్యం జరుగుతున్న సంఘర్షణా యుద్ధంలో తాను సమిధననీ, తనను కాల్చే యీ ధర్మం వెలుగుతుందనీ, ఆలోచనా ధారలు యింకా విస్తృతమైతే తప్పు తనలా లో వాళ్ళకు వ్యత్యాంతరం లేదనీ, తనకిక తండ్రి ఒక్కడనీ, తానిక దిక్కు లేని పక్షిననీ, సమాజ తుఫానులో, సుడిగాలిలో కొట్టుకొని పోతున్న చిన్న పిచిక పిల్లననీ ఎలా తెలుస్తుంది – వాడికి, అయిదారేళ్ళ కుర్రవాడికి.

'పాపం పుణ్యం ప్రపంచమార్గం, కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ ఏమీ ఎరుగని పూవు'ల–అయిదారేళ్ళవాడికి ఎలా తెలుస్తుంది ? ఎలా ? ఎలా ??